ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

Bullet Edition

సోమవారం 17 మార్చి 2025 www.prajaaswaramdaily.com 2 pm


## హిందుస్థాన్ ఏరోనాటిక్స్ సంస్థకే కుచ్చుటోపీ




ఢిల్లీ : సైబర్ కేటుగాళ్లు హిందుస్థాన్ ఏరోనాటిక్స్‌నే మోసం చేశారు. 2024 మే నెలలో హాల్ సంస్థ మూడు ఫైటర్ విమానాలకు సంబంధించిన కొన్ని పార్టుల కోసం అమెరికాలోని కంపెనీని సంప్రదించింది. ఆ సంస్థ కూడా దీనికి ఈ-మెయిల్‌లో స్పందించింది. సైబర్ కేటుగాళ్ల నుంచి ఈమెయిల్ సందేశాలు రావడం మొదలయ్యాయి. ఆ మెయిల్ సూచించిన ఖాతాకు రూ.55 లక్షలు చెల్లించారు. కానీ, కంపెనీ మాత్రం తమకు డబ్బు ముట్టలేదని చెప్పడంతో అధికారులు కంగారుపడి ఖాతాలను సరిచూశారు. చివరికి తప్పుడు ఈమెయిల్ సూచించిన ఖాతాకు డబ్బు వెళ్లినట్లు గుర్తించారు అని సీనియర్ పోలీసు అధికారి ఒకరు వెల్లడించారు.



## కీలక బిల్లులను ప్రవేశపెట్టిన ప్రభుత్వం

హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం శాసనసభలో కీలక బిల్లులను ప్రవేశపెట్టింది. బీసీలకు విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఒక బిల్లు, ఎస్‌సీ వర్గీకరణ, దేవాదాయ చట్ట సవరణపై బిల్లులను ప్రవేశపెట్టారు. బీసీ రిజర్వేషన్ బిల్లును మంత్రి పొన్నం ప్రభాకర్, ఎస్‌సీ వర్గీకరణ బిల్లును మంత్రి దామోదర రాజనర్సింహ, దేవాదాయ చట్ట సవరణ బిల్లును మంత్రి కొండా సురేఖ సభలో ప్రవేశపెట్టారు. అలాగే తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టే బిల్లును కూడా ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ బిల్లులకు సభలో ఆమోదం లభించింది.

## ఎంఐఎం సభ్యుల వాకౌట్



హైదరాబాద్: తెలంగాణ శాసనసభ నుంచి ఎంఐఎం వాకౌట్ చేసింది. సభను నడుపుతున్న తీరును నిరసిస్తూ ఆ పార్టీ సభ్యులు బయటకు వచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తీరుపై మజ్లిస్ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభను నడపడంలో ప్రభుత్వం విఫలమైందని, సభలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తారా?ఇది గాంధీభవన్ కాదు.. తెలంగాణ శాసనసభ అని అక్బరుద్దీన్ మండిపడ్డారు.

## ఎంపీ డీకే అరుణ ఇంట్లో ఆగంతకుడి చొరబాటు కేసు ముమ్మరం

హైదరాబాద్: బీజేపీ ఎంపీ డీకే అరుణ ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తి చొరబడిన కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఆగంతకుడిని గుర్తించేందుకు సీసీ ఫుటేజ్‌ను మరోసారి పరిశీలించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో సీపీ సీవీ ఆనంద్ ఎంపీ ఇంటికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆయనతో పాటు వెస్ట్ జోన్ డీసీపీ విజయ్‌కుమార్, జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకట్‌రెడ్డి ఉన్నారు. సీఎం ఆదేశాల నేపథ్యంలో డీకే అరుణకు కల్పించాల్సిన భద్రత పైనా డీసీపీ వివరాలు సేకరించారు. సోమవారం ఉదయం ఎంపీతో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడి ఈ ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్న విషయం తెలిసిందే. ఆదివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 56లోని బీజేపీ ఎంపీ డీకే అరుణ నివాసంలోకి ముసుగు ధరించిన ఆగంతకుడు ఇంటి వెనుక నుంచి లోపలికి ప్రవేశించాడు. సీసీ కెమెరా వైర్లను కత్తిరించి, సుమారు గంట పాటు ఇంట్లో తిరిగి అక్కడి నుంచి జారుకొన్నాడు. ఆమె కుమార్తె ఉదయం నిద్రలేచి చూసేసరికి ఇల్లంతా చిందరవందరగా ఉంది. వంట గది కిటికీ గ్రిల్ తొలగించడం గమనించారు. దీనిపై ఎంపీ డ్రైవర్ లక్ష్మణ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు పొట్టి శ్రీరాములు పేరు

**కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ సహకరించాలి**

**కేంద్రం నుంచి అనుమతి తీసుకురావాలి**

**సీఎం రేవంత్**



హైదరాబాద్: చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు పొట్టి శ్రీరాములు పేరు పెట్టాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదిస్తున్నట్లు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకురావాలని కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ను కోరుతున్నా అన్నారు. "తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో అనేక యూనివర్సిటీలకు పేర్లు మార్చుకున్నాం. పరిపాలనా సౌలభ్యం కోసమే కొన్ని వర్సిటీలకు ప్రొఫెసర్ జయశంకర్, కొండా లక్ష్మణ్ బాపూజీ, పీవీ నరసింహారావు, కాళోజీ నారాయణరావు పేర్లు పెట్టుకున్నాం. అదే ఒరవడిలో పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీకి సురవరం ప్రతాప్‌రెడ్డి పేరు పెడుతున్నాం. తెలంగాణ సమాజానికి ఆయన ఎంతో సేవ చేశారు. గోల్కొండ పత్రికను సురవరం నడిపారు. నిజాంకు వ్యతిరేకంగా పోరాడారు. పొట్టి శ్రీరాములు వర్సిటీ పేరు మార్చడం ఎవరికీ వ్యతిరేకం కాదు. తెలుగు రాష్ట్రాల్లో ఒకే పేరుపై యూనివర్సిటీలు, సంస్థలు ఉంటే పరిపాలనా పరమైన సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశముంది. దాన్ని పరిష్కరించేందుకే రాష్ట్రంలోని యూనివర్సిటీలు, సంస్థలకు తెలంగాణకు సంబంధించిన పేర్లు పెడుతున్నాం. శాసనసభలో ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్, తెలుగు వర్సిటీ పేరు మార్పు తదితర బిల్లులు ప్రవేశపెట్టిన నేపథ్యంలో సీఎం మాట్లాడారు. చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు పొట్టి శ్రీరాములు పేరు పెట్టాలని కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కు లేఖ రాస్తా. మాజీ సీఎం రోశయ్య, ఆర్యవైశ్య సమాజం పట్ల ప్రభుత్వానికి అపారమైన గౌరవం, నమ్మకం, విశ్వాసం ఉంది. కులం, మతం పేరుతో రాజకీయ ప్రయోజనాలు పొందాలనుకోవడం సరికాదు.

### నేచర్ క్యూర్ ఆస్పత్రికి రోశయ్య పేరు

బల్కంపేట్‌లో నేచర్ క్యూర్ ఆస్పత్రికి రోశయ్య పేరు పెడతాం. ఆయన సుదీర్ఘ అనుభవం గల నేత. గవర్నర్‌గా, సీఎంగా ఎన్నో సేవలందించారు. నేచర్‌క్యూర్ ఆస్పత్రి సమీపంలో రోశయ్య విగ్రహం నెలకొల్పి అధికారికంగా జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తాం అని సీఎం ప్రకటించారు.

## ఆర్సీ 16లో కన్నడ నటి



హైదరాబాద్: రామ్ చరణ్, బుచ్చిబాబు కాంబినేషన్లో వస్తున్న ఆర్సీ 16 గురించి ఒక వార్త సామాజిక మాధ్యమంలో హల్ చల్ చేస్తుంది. దివంగత నటుడు చిరంజీవి సర్జా సతీమణి నటి మేఘనా రాజ్ నటిస్తున్నట్లు వార్త వినిపిస్తున్నది. తన పాత్ర నచ్చడంతో ఆమె కూడా వెంటనే ఇందులో నటించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. చిత్రబృందం నుంచి ఈ విషయమై ఎలాంటి స్పష్టమైన ప్రకటన ఏమీ రాలేదు. ఈ చిత్రంలో హీరోయిన్ గా జాన్వీ కపూర్, శివ రాజ్‌కుమార్, జగపతిబాబు కీలక పాత్రలో కనిపించనున్నారు. రెహమాన్ మ్యూజిక్ డైరెక్టర్.

## విదేశీ విద్యా పథకంపై రాజకీయం తగదు గంగుల

**మంత్రి సీతక్క**





హైదరాబాద్: విదేశీ విద్య పథకాన్ని రాజకీయం చేయాలనేది గంగుల కమలాకర్ తపన అని మంత్రి సీతక్క విమర్శించారు. ఆమె శాసనసభలో మాట్లాడారు. "నేను మాట్లాడిన దాంట్లో తప్పులు ఉన్నాయని చెబుతున్నారు. విదేశీ విద్యా పథకం కింద 1913 మంది చదువుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 210 మంది ఎస్సీలు, 300 మంది బీసీలు, 100 మంది ఎస్టీలు, 500 మంది మైనార్టీ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ పథకం కింద మొత్తం 1,110 మంది విద్యార్థులను ఎంపిక చేశాం. గత బకాయిలతో కలిపి రూ.167 కోట్లు చెల్లించాం. కాంగ్రెస్ వచ్చే నాటికి పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్ బకాయిలు రూ.4,332 కోట్లు. పెండింగ్ స్కాలర్‌షిప్ బకాయిలను త్వరలో చెల్లిస్తాం అని సీతక్క తెలిపారు.

ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చింది సున్నా: గంగుల

విదేశీ విద్యా పథకం కింద ఎంపికైన విద్యార్థుల సంఖ్య 1913 అన్నారు. గతంలో కేవలం బీసీల్లోనే 2,230 మందిని ఈ పథకం కింద ఎంపిక చేశారన్నారు. అయితే ఎంపికైన విద్యార్థుల సంఖ్య స్పష్టంగా చెప్పాలన్నారు. 2016లో కేసీఆర్ హయాంలో విదేశీ విద్య పథకం అమలు చేశారన్నారు. గతంలో ఏటా 300 మంది విద్యార్థులను ఎంపిక చేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం బీసీలు, మైనార్టీలు, ఎస్టీలకు పథకం కింద ఇచ్చింది సున్నా అని గంగుల విమర్శించారు. జనవరిలో కేవలం 105 మంది ఎస్సీలను పథకం కింద ఎంపిక చేశారని,. గతంలో 1050 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు, 2,751 మంది మైనార్టీలకు, 2123 మంది బీసీ విద్యార్థులకు, 780 మంది బ్రాహ్మణ విద్యార్థులకు ఈ పథకం అమలు చేశామన్నారు. గతంలో పేద వర్గాలకు చెందిన 6,700 మందికి ఈ పథకం అమలైందన్నారు. విదేశీ విద్య పథకం బకాయిలు వెంటనే చెల్లించాలి. ఐఐటీల్లో చదివే పేద విద్యార్థులకు గతంలో రూ.2 లక్షలు అందేవి అని అన్నారు. ప్రస్తుతం వారికి ఆర్థిక సాయం అందట్లేదు అని గంగుల చెప్పారు.

## కేటీఆర్, హరీశ్‌తో తీన్మార్ మల్లన్న భేటీ

**బీసీ నేతలతో కలిసి ఆయన.. మెమోరాండం అందజేత**



హైదరాబాద్ : అసెంబ్లీ వేదికగా తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. కాంగ్రెస్ బహిష్కృతనేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, హరీశ్ రావుతో భేటీ అయ్యారు. బీసీ రిజర్వేషన్ బిల్లుపై సభలో ప్రభుత్వాన్ని నిలదీయాలని బీఆర్ఎస్ నేతలను కోరారు. బీసీ నేతలతో కలిసి కేటీఆర్‌కు మల్లన్న మెమోరాండం అందించారు. అలాగే బీసీ బిల్లుకు కేంద్రం చట్టబద్ధత కల్పించేలా ఢిల్లీ వేదికగా తాము చేయబోయే ధర్నాకు మద్దతు ఇవ్వాల్సిందిగా తీన్మార్ మల్లన్న బీఆర్ఎస్ పార్టీ నేతలను కోరారు. వీరి భేటీపై సోషల్ మీడియాలో భిన్నస్వరాలు వినిపిస్తున్నాయి. ఫిబ్రవరి 5న పీసీసీ క్రమశిక్షణ కమిటీ ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఫిబ్రవరి 12లోపు వివరణ ఇవ్వాలని పేర్కొంది. ఆయన నుంచి ఎలాంటి వివరణ ఇవ్వలేదు. అందుకే పార్టీ నుంచి సస్పెండ్ చేసింది.